క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక

చెన్నారావుపేట : మండలంలోని బాపునగర్, జౌసులతండా, నంబర్–3 కాలనీ, నందిగడ్డ, కందిగడ్డతండాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎంపీపీ జక్క అశోక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో గురువారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. నాయకులు భూక్యా లింగం నాయక్, మేగ్య నాయక్ తదితరులు ఉన్నారు.

ఫైర్‌మన్ విభాగానికి ఎంపిక



ఎం. సింహాద్రి

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లో గల తెలంగాణ రాష్ట్ర గిరిజన సైనిక బాలుర డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి ఆర్మీ ఫైర్‌మన్ విభాగానికి ఎంపికైనట్లు డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థిని గురువారం పాఠశాలలో అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న మాలోత్ సింహాద్రి ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్(ఏఓసీ) ఫైర్‌మన్ విభాగానికి ఎంపికైనట్లు తెలిపారు. ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని వార్ధా నగరంలో జరిగిన దేహదారుఢ్య, మెడికల్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే మే 21న వార్ధాలో జరిగిన రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఏఓసీ విభాగానికి ఎంపికైనట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ శేరికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో ప్రతిభ



ఎం. శిరీష

వర్ధన్నపేట : వర్ధన్నపేట పరిధిలోని నీలగిరిస్వామి తండాకు చెందిన మాలోత్ శిరీషకు నీట్‌లో ర్యాంకు వచ్చింది. 720 మార్కులకు 437మార్కులు సాధించి 1,70,000 ఆల్ ఇండియా ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులు దేవేందర్, విమల తమ కుమార్తెను చదువులో ప్రోత్సహిస్తున్నారు. ఈ ర్యాంకుతో రిజర్వేషన్ కోటాలో మెడికల్ కళాశాలలో సీటు వస్తుందని వారు చెబుతున్నారు. కార్డియాలజిస్ట్‌గా పేదలకు సేవలందిస్తానని ఆమె తెలిపింది.

ఎస్సై చిత్రపటానికి క్షీరాభిషేకం



చెన్నారావుపేట : ధాన్యం కొనుగోలు కేంద్రంలో అక్రమాలను అరికట్టిన ఎస్సై తోట మహేందర్ చిత్రపటానికి స్థానిక రైతులు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ చీకటి స్వరూప, రైతులు మాట్లాడుతూ మగ్దుంపురం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైస్‌మిల్లు యజమానులు కుమ్మక్కై రైతులను తూకంలో మోసం చేస్తున్నారని ఇటీవల ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. కాగా ఎస్సై ఇచ్చిన హామీ మేరకు సెంటర్, మిల్లు యజమానులతో మాట్లాడి రైతులకు న్యాయం చేశారు. దీంతో రైతులు ఎస్సై చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

పరామర్శ

ఖానాపురం : మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. బుధరావుపేటకు చెందిన వేణుగోపాల్ రెడ్డి, పూలమ్మ, అజార్, ధర్మరావుపేటకు చెందిన పెద్ద సాయిలు, కైలాసం, మండల కేంద్రానికి చెందిన కన్నె చిన్న యాకయ్య మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్ రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్, కత్తాల వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

దుగ్గొండి : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గీసుకొండ మండలం కొమ్మాల గ్రామానికి చెందిన ఏవూరి రజిత (35)గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. కొమ్మాల గ్రామానికి చెందిన ఏవూరి శ్రీధర్‌రెడ్డి, భార్య రజిత, కుమారుడు స్టాలిన్ రెడ్డి, కూతురు అమ్ములు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మండలంలోని గిర్నిబావి సమీపంలో బుధవారం రాత్రి కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా రజిత మృతి చెందింది. మృతురాలి బంధువు యాదవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

నేడు ఆఖరి మజిలీ భవనం ప్రారంభం

నర్సంపేట : పట్టణంలోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆఖరి మజిలీ భవనాన్ని నిర్మించారు. రూ.16లక్షల పట్టణ ప్రగతి నిధులతో నిర్మించిన భవనాన్ని నేడు(శుక్రవారం) ప్రారంభించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, కమిషనర్ వెంకటస్వామి గురువారం తెలిపారు. ప్రారంభోత్సవానికి మంత్రులు దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హాజరుకానున్నారని చెప్పారు.

నెక్కొండ: కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్ యమునారెడ్డి



సంగెం: మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనం వద్ద..



చెన్నారావుపేట: తిమ్మరాయినిపహాడ్‌లో జెండా ఆవిష్కరిస్తున్న పాలకులు



ఘనంగా పల్లె ప్రగతి దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లోని గ్రామాల్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం పల్లె ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. జాతీయ జెండాలను ఆవిష్కరించారు. జీపీ కార్మికులను సన్మానించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు , పలు శాఖల అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



నెక్కొండ: ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, జీపీ కార్మికులు



నల్లబెల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పక్కన అధికారులు. ప్రజాప్రతినిధులు



చెన్నారావుపేట: సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు



ఖానాపురం: కొత్తూరులో ర్యాలీ..



నల్లబెల్లి: లెంకాలపల్లిలో..



ఖానాపురం: జీపీ కార్మికులకు సన్మానం..



వర్ధన్నపేట: సిబ్బందిని సన్మానిస్తున్న బాధ్యులు



నర్సంపేట రూరల్: రామవరంలో..



గీసుకొండ: గంగదేవిపల్లిలో..



దుగ్గొండి: లక్ష్మీపురంలో..

జీపీ నిధుల దుర్వినియోగంపై వినతి

ఖానాపురం : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని వార్డు సభ్యులు దమయంతి, స్రవంతి, నాగరాజు ఆరోపించారు. ఈ మేరకు నిధుల దుర్వినియోగం లెక్కలు తెలిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో అక్రమ లేఅవుట్‌లు, నిర్మాణాల విషయంలో ముగ్గురు కలిసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పాలకవర్గ సభ్యులకు తెలియకుండా సర్పంచ్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ కార్యాలయంలో పలువురు వార్డు సభ్యులు సర్పంచ్, అధికారుల తీరును నిరసిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై నిలదీయడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. వార్డు సభ్యులు అరుణ, రాజమణి, అశ్విని, స్వామి పాల్గొన్నారు.

19న ఆత్మీయ సమ్మేళనం

రాయపర్తి : ఈనెల 19న బీఆర్‌ఎస్ నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి కోరారు. గురువారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కాట్రపల్లి, బురహాన్‌పల్లి, సన్నూరు, వెంకటేశ్వరపల్లి, జయరాంతండా, బాలునాయక్‌తండా గ్రామాల కార్యకర్తలు పాల్గొనాలన్నారు. రంగు కుమార్‌గౌడ్, పూస మధు, ఉందాటి సతీష్, మండల శ్రీధర్, సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య, అష్రఫ్‌పాషా ఉన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

రాయపర్తి : రేకులషెడ్డు, విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొట్టిన సంఘటన గురువారం తెల్లవారుజామున మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం మండల కేంద్రంలోని ఓ సెలూన్ ఎదుట ఉన్న రేకులషెడ్డుతోపాటు విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొంది. ఆ సమయంలో అటువైపు ఎవరూ రాకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి ఫలాలు

మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



చెన్నారావుపేట: యాత్రలో దొంతి మాధవరెడ్డి

చెన్నారావుపేట : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందుతాయని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని బాపునగర్, భగవాన్‌తండా, నంబర్–3 కాలనీ, నందిగడ్డ, కందిగడ్డతండాల్లో హాథ్ సే హాథ్ జోడోయాత్ర బుధవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీ నెరవేర్చలేదన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రతో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.500 గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలకు రూ. 5 లక్షలతో పాటు పలు సంక్షేమ ఫలాలు అందుతాయని అన్నారు. ఈ యాత్రలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అధ్యక్షుడు భూక్యా గోపాల్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సర్పంచ్‌లు సిద్దన రమేష్, తప్పెట రమేష్, నాయకులు, పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవాలి

ఖానాపురం : తెలంగాణ రాష్ట్రాన్ని కుటుంబ పాలన నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని దబ్బీర్‌పేట, కీర్యతండా, చిలుకమ్మతండా, పర్శతండాల్లో హాథ్‌సే హాథ్ జోడో యాత్రను గురువారం రాత్రి నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, శాఖమూరి ముకేష్‌చౌదరి, నాయకులు ఉన్నారు.

ప్రచార రథం అడ్డగింత

ఖానాపురం : మండలంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రను మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గురువారం రాత్రి చేపట్టారు. యాత్రకు ముందు వెళ్లడానికి మండలంలోని పర్శతండాలో జెండాలను పెట్టారు. ఆ తర్వాత ప్రచారం చేయడానికి మాధవరెడ్డికి చెందిన ప్రచార రథం తండాకు వెళ్లింది. తండాకు చెందిన ఇరువురు వార్డు సభ్యులు, పలువురు యువకులతో పాటు తండావాసులు ప్రచారరథాన్ని అడ్డుకున్నారు. గతేడాది ట్రాక్టర్ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన ఘటనలో కనీసం పరామర్శ చేయలేదని, ఎన్నికల సమయంలో గ్రామానికి రోడ్డు వేస్తానని చెప్పి వేయకపోవడం, తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దొంతి వద్దకు వెళ్తే పట్టించుకోలేదని ఆరోపిస్తూ ప్రచార రథాన్ని అడ్డుకున్నట్లు తండావాసులు ఆరోపించారు. రథంతో వచ్చిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు సైతం వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికి వినిపించుకోకపోవడంతో ప్రచార రథాన్ని వెనక్కి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు తండాకు వెళ్లి ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.

వేసవి సెలవులు ప్రకటించాలి

చెన్నారావుపేట : ఎండ తీవ్రత దృష్ట్యా పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించాలని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఆంగోతు భద్రయ్య కోరారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎండలు అధికంగా ఉండటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని తెలిపారు. వాతావరణం చల్లబడే వరకు వేసవి సెలవులు ఇవ్వాలని ఆయన కోరారు. లేనిఎడల ఉదయం 7.30 గంటల నుంచి 11 గంటల వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని పేర్కొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

సంగెం : పాస్టర్ల సంఘం మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చైర్మన్ సామ్యేల్ ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడుగా వి. ప్రశాంత్, ఉపాధ్యక్షుడుగా ఆర్.పీటర్, కార్యదర్శిగా ఎస్.ఫిలిప్ జాన్, సహాయ కార్యదర్శిగా జోసఫ్, కోశాధికారిగా కె.ఫిలిప్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నియామకం



నర్సంపేట : బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్‌గా జూలూరి మనీష్‌గౌడ్ నియామకం అయ్యారు. ఈ మేరకు పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో గురువారం బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మనీష్‌గౌడ్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, ఎడ్ల అశోక్‌రెడ్డి, గోదాసి చిన్న, వడ్డేపల్లి నర్సింహరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్‌లో వాగ్వాదం

ఖానాపురం : తెలంగాణ ప్రభుత్వం కుల వృత్తిదారులకు రూ.1లక్ష అందజేయనుంది. ఇందుకోసం దరఖాస్తుల ప్రక్రియను ఆహ్వానించిన విషయం విదితమే. దరఖాస్తు ప్రక్రియను ఈనెల 20 లోపు పూర్తి చేసుకోవాలని ఆదేశించింది. దరఖాస్తుల కోసం కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని తెలపడంతో మండల వ్యాప్తంగా కులవృత్తిదారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బారులు తీరుతున్నారు. ఇందులో భాగంగా గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు లబ్ధిదారులు భారీగా చేరుకోని తమ సర్టిఫికెట్‌లు త్వరగా చేయాలంటూ వాగ్వాదానికి దిగారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో త్వరగా పూర్తి చేయాలని, ప్రభుత్వం పెట్టిన గడువు దగ్గరపడుతుండటంతో నష్టపోతామని కుల వృత్తిలదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ పల్లెలు.. దేశానికే ఆదర్శం



మహిళలతో కలిసి కోలాటం ఆడుతున్న మంత్రి

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు, గట్టికల్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాల వేశారు. అనంతరం మహిళలతో కలిసి ముగ్గులు వేసి, కోలాటం ఆడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పల్లె ప్రగతి కార్యక్రమం తో తెలంగాణ పల్లెలు.. దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, సర్పంచ్‌లు చిన్నాల తారశ్రీరాజాబాబు, చిన్నాల వనజలక్ష్మీనారాయణ, ఎంపీటీసీలు బండి అనూష రాజబాబు, గ్రామస్తులు బొమ్మెర వీరస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆశీర్వదిస్తే సేవ చేస్తా..

ఎన్‌ఆర్‌ఐ ఝాన్సీరెడ్డి



మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

రాయపర్తి : ప్రజలు ఆశీర్వదిస్తే సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఎన్‌ఆర్‌ఐ, కాంగ్రెస్ నాయకురాలు అనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. పాలకుర్తి మండలం నుంచి ర్యాలీగా రాయపర్తి, మైలారం మీదుగా సన్నూరు వరకు గురువారం భారీ ర్యాలీగా వెళ్లారు. అనంతరం సన్నూరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనది తొర్రూరు మండలం చర్లపాలెం అని, పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు వచ్చానని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఏ మేరకు నిర్ణయం తీసుకుంటుందో వేచి చూస్తానన్నారు. తొర్రూరు మండలం గుర్తూరులో అనాథలకు ఆశ్రమం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్, పెండ్లి మహేందర్ రెడ్డి, సరికొండ కృష్ణారెడ్డి, కుందూరు విక్రమ్‌రెడ్డి, కృష్ణమాచార్యులు, రత్నాకర్‌రెడ్డి, చిన్నపాక ఎల్లయ్య, యాదగిరి, చిర్ర మల్లయ్య, గబ్బెట బాబు, ఎండీ.అఫ్రోజ్, ఎండీ.మహమూద్, మచ్చ నీలయ్య పాల్గొన్నారు.

‘పార్టీ కార్యక్రమంగా మార్చారు’

గీసుకొండ : మండలంలోని కొనాయమాకులలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన పల్లెప్రగతి ఉత్సవాలను బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు పార్టీ కార్యక్రమంగా మార్చారని మండల కోఆప్షన్ మెంబర్ ఎండి రహీం ఆరోపించారు. కొనాయమాకుల ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నాయకులు డీజే మోతలతో బీఆర్‌ఎస్ ప్రచార పాటలతో ర్యాలీగా వచ్చారని, అధికారులకు విషయం చెప్పినా పట్టించుకోలేదని పేర్కొన్నారు.

పల్లెప్రగతి వేడుకల్లో ఘర్షణ

- మహిళ మాట్లాడుతుండగా అడ్డుకున్న సర్పంచ్ మహేందర్
- ఇరువర్గాల గొడవ.. పోలీసులకు పరస్పరం ఫిర్యాదు
- మందపల్లిలో విచారణ చేపట్టిన ఎస్సై



విచారిస్తున్న ఎస్సై నవీన్‌కుమార్

దుగ్గొండి : పల్లెప్రగతి వేడుకల్లో సర్పంచ్, మహిళలకు మధ్య ఘర్షణ జరిగిన సంఘటన మందపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పల్లెప్రగతి సంబురాల్లో భాగంగా గ్రామ సందర్శన, పతాకావిష్కరణ అనంతరం గ్రామ సభ నిర్వహించారు. ఈ క్రమంలో సమస్యలు, అభివృద్ధి పనులపై ఎవరైనా మాట్లాడవచ్చునని ఆహ్వానించడంతో గ్రామస్తురాలు పెండ్యాల రమ స్టేజీపైకి వెళ్లి మాట్లాడారు. మహిళా సంఘాల్లో జరిగిన అవినీతిని ఏకరువు పెట్టింది. సర్పంచ్ మొగ్గం మహేందర్ మహిళా సంఘాలను అవమానిస్తున్నాడని, అవినీతికి పాల్పడిన వారికి వత్తాసు పలుకుతున్నాడని, అవినీతిని ప్రశ్నించే మహిళలపై పరుష పదజాలంతో మాట్లాడుతున్నాడని పేర్కొంది. దీంతో సర్పంచ్ మహేందర్ కల్పించుకుని అడ్డుతగిలాడు. ఇద్దరూ దుర్భాషలాడుకున్నారు. ఈక్రమంలో సర్పంచ్, మహిళలకు మధ్య తోపులాటలు జరిగి పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై నవీన్‌కుమార్, పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరువర్గాలతో పాటు గ్రామస్తులను విచారించారు.

అసైన్డ్ భూములను పేదలకు ఇవ్వాలి



అసైన్డ్ భూమిలో సీపీఐ జెండాలతో నాయకులు

నర్సంపేట రూరల్ : అసైన్డ్ భూములను కొందరు యథేచ్ఛగా కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, ఆ భూమిని పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా నాయకులు మియాపురం గోవర్ధన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు అన్నారు. నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామ శివారు చింతగడ్డతండా శివారులోని 116/1/60 ప్రభుత్వ భూమిని కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి వ్యాపారం చేస్తున్నారని, ఆ భూమిలో సీపీఐ ఆధ్వర్యంలో జెండాలు పాతి ఆ భూమిని ఆక్రమించుకునేందుకు యత్నించగా రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో వారిని అక్కడి నుంచి పంపివేశారు. పాతిన జెండాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈకార్యక్రమంలో సీపీఐ నర్సంపేట మండల కార్యదర్శి యాకయ్య, వీరు నాయక్, కవిత, నాగరాజు, సతీష్, యాదగిరి, యాకయ్య, సరిత, యశోద తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

నర్సంపేట : వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి పాలకులు కృషి చేయాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎర్ర జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం వయోవృద్ధుల వేధింపుల విమోచన దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్ సంఘం సభ్యులు తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రెజరర్ మేరుగు లక్ష్మణ్‌బాబు, కోడాటి వీరస్వామి, వడ్లకొండ సాంబయ్య, సీహెచ్.సత్యం, వి.మల్లయ్య, ఆర్.సుధాకర్, కడెం ఈశ్వరమూర్తి, ఎల్.నర్సింగరావు, కె.జనార్దన్, సీహెచ్.జనార్దన్, పి. ఎల్లయ్య, గండు రాజేశ్వర్, నర్సయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి



నర్సంపేట : తెలంగాణ రాష్ట్రంలో కార్మిక శాఖ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను అసంఘటిత రంగ కార్మికులు విరివిగా వినియోగించుకోవాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 12వ వార్డులో ఛాయా స్వచ్ఛంధ సంస్థ కార్యదర్శి కోట డేవిడ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మగ్గం శిక్షణ కేంద్రాన్ని గురువారం యువరాజు సందర్శించి మాట్లాడారు. స్వయం ఉపాధి పొందుటకు ఇంటి వద్దనే ఉండి పని చేసుకోవడానికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. సంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులందరూ లేబర్ శాఖ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఎండి.పాషా, షాహిమిద, చైతన్య, గౌస్య, సల్మా, ఖాసీంబీ, స్వాతి, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.